# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 143 క్రిష్ణా, మంగళవారం 17 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ణంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## చంద్రబాబు ముందుచూపు ఉన్న నేత అంటూ గేట్స్ ప్రశంస



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 16: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో నవ్యాంధ్రకు కొత్త దశ–దిశ లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. బిల్ గేట్స్ రాకను చారిత్రాత్మకమని అభివర్ణించిన సీఎం, ఈ భాగస్వామ్యం రాష్ట్ర ప్రజల సాధికారతకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. 1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన నాటి నుంచి తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్, భారత డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తాను తొలిసారి చంద్రబాబును కలిసినప్పుడే ఆయన ఆలోచనల్లోని ముందుచూపును గ్రహించానని వెల్లడించారు. ఆ రోజుల్లో ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత సమీపంలో ఉండేవారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఈ స్థాయిలో వినియోగించడం లేదని, కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం గొప్ప పరిణామమని అభినందించారు. విపత్తుల నిర్వహణలో టెక్నాలజీతో ప్రాణనష్టం నివారించే వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రశంసించారు. చంద్రబాబు తనకు “గుడ్ ఓల్డ్ ఫ్రెండ్” అని బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. రెవెన్యూ శాఖలో పోస్టు పేరు మార్పు




క్రైం కౌంటర్ న్యూస్,అమరావతి, ఫిబ్రవరి 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల పరిమితులను సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకుంటున్న మార్పుల్లో భాగంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖలోని ఎమ్మార్వో కార్యాలయాల్లో పని చేసే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు పేరును మారుస్తూ, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉత్తర్వులు విడుదల చేసింది. ఉత్తర్వుల ప్రకారం, ఇప్పటికే ఈ పోస్టులో పనిచేస్తున్న ఉద్యోగులు ఇక నుంచి జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ గా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మార్పు కారణంగా ఉద్యోగ వివరణలు, జాబ్ ప్రొఫైల్, సమర్థతా ప్రమాణాలు స్పష్టతతో గుర్తిస్తున్నట్లు తెలిపింది. ముఖ్యంగా జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అసిస్టెంట్‌గా నిర్వహిస్తున్న విధులు ఇప్పుడు జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మారాయి. రెవెన్యూ శాఖలో వర్క్ లోడును సరళతరం చేయడం, పోస్టుల మధ్య స్పష్టత, ఉద్యోగుల బాధ్యతలను సులభంగా గుర్తించడం ఈ మార్పు లక్ష్యంగా ఉంది. ఇది శాఖలో పనితీరును మరింత సమర్థవంతంగా మార్చే దిశగా పరిగణించవచ్చు.

## ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు..



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి16 : గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. ‘నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే ‘హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ’.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు.

బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్‌లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నామనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకున్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినందనలు తెలిపారు.డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ–గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ప్లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావేశానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు రావడానికి దారి తీసిన పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యమంత్రితో పాటు.. గేట్స్ కూడా నాటి ఢిల్లీ సమావేశం, సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు, అమెరికా వెలుపల తొలి డెవలప్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం గురించి సమావేశంలో ఉన్న మంత్రులు, సెక్రటరీలకు వివరించారు బిల్‌గేట్స్. తొలి భేటీలోనే చంద్రబాబు విజనరీ ఆలోచనలను తాను గమనించానని బిల్‌గేట్స్ చెప్పుకొచ్చారు. అక్కడి నుంచి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన బిల్‌గేట్స్ బృందం.. సాగులో టెక్నాలజీ అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించి ప్రశంసించారు. ప్రకృతి సాగు గురించి రైతులు, అధికారులతో చర్చించారు బిల్‌గేట్స్. అలాగే పంట ఉత్పత్తులను పరిశీలించారు. చీడపీడలకు సంబంధించిన వివరాలు అందించే (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) మొబైల్ యాప్ పనితీరును పరిశీలించారు బిల్‌గేట్స్. రైతు ఫోన్ ద్వారా ఈ యాప్‌ను ఉపయోగించి పంటకు వచ్చిన తెగులును గుర్తించడమే కాకుండా... డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేసే విధానాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు బిల్‌గేట్స్. వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన బిల్ గేట్స్‌కు.. రైతులు స్థానిక వంటకాలను రుచిచూపించారు.



## ఏఐ ఇంపాక్ట్ సదస్సు..

### స్పందించిన ప్రధాని మోదీ

క్రైం కౌంటర్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఏఐ ఇంపాక్ట్ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సు సోమవారం సాయంత్రం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఈ సదస్సు ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడతాయని తాను విశ్వసిస్న్?న్నట్లు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం.. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ ( అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం) అని తెలిపారు. ఈ సదస్సుకు ప్రపంచంలోని వివిధ దేశాధినేతలు, పలు పరిశ్రమల అధిపతులు, పరిశోధకులు, సాంకేతిక ఔత్సాహికులతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.కృత్రిమ మేథస్సు(ఎఐ)పై సదస్సు ఆ రోజు అంటే.. సోమవారం సాయంత్రం ప్రారంభం కానుంది. ఈ సదస్సుకు ప్రపంచ నేతలు, ప్రముఖ టెక్ కంపెనీల సీఈఓలు, వేలాది మంది ప్రతినిధులు దేశ రాజధాని న్యూఢిల్లీకి వచ్చారు. ఈ నేపథ్యంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు జరిగే ప్రదేశంతోపాటు పరిసర ప్రాంతాల్లో వేలాది మంది పోలీసులను మోహరించారు. ఈ సదస్సుకు హాజరవుతున్న ప్రముఖల జాబితాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా, గూగుల్ సీఈఓ సుందర్ పిచ్చాయి తదితరులు ఉన్నారు.

అలాగే యూరప్, ఆసియా దేశాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సుకు తరలి వచ్చారు. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు 1.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సమావేశాల్లో ఇది అతి పెద్దదని చెబుతున్నారు. ఈ సదస్సు ఫిబ్రవరి 20వ తేదీ వరకు జరగనుంది.

## విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగు: మంత్రి లోకేశ్



క్రైం కౌంటర్ న్యూస్, ఢిల్లీ, ఫిబ్రవరి16 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటిస్తున్నారు. తన పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో యువనేత పాల్గొంటున్నారు. చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్‌ను లోకేశ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ పైలెట్ కేడట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మీడియాతో మాట్లాడారు. విమానయాన రంగానికి ప్రపంచస్థాయి నైపుణ్యాల దిశగా కీలక ముందడుగు పడిందని తెలిపారు. అట్లాంటా పర్యటన సమయంలో ఆలోచనగా మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు నిజంగా రెక్కలు తొడుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి ప్రతిభతో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగని వివరించారు. యువపైలట్ కేడట్లతో జరిగిన ముఖాముఖి కార్యక్రమం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. విమానయాన భవిష్యత్తుకు కొత్త ఉత్సాహం, దిశ కనిపించిందని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# బిల్ గేట్స్ అమరావతి సందర్శన.. సీఎం చంద్రబాబుతో కీలక భేటీ



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 16:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయంలో ఐటీ మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తర్వాత రాష్ట్ర సచివాలయానికి చేరుకున్న బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో సహా ఇతర మంత్రులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో స్నేహపూర్వక భేటీ జరిగింది.

సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ను బిల్ గేట్స్ సందర్శించారు. అక్కడ పరిపాలనలో సాంకేతికత వినియోగం, డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి ఆధునిక విధానాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రజలకు అందుతున్న సేవలు, డిజిటల్ గవర్నెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న పురోగతిని వివరించారు. బిల్ గేట్స్ ఈ చర్యలపై ప్రశంసలు కురిపించారు.

అనంతరం సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రులు, అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతికత రంగాల్లో గేట్స్ ఫౌండేషన్‌తో సహకారం, 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై చర్చలు జరిగాయి. రాష్ట్రంలో జరుగుతున్న సంజీవని ప్రాజెక్టు వంటి కార్యక్రమాలపై కూడా దృష్టి సారించారు.

ఈ సందర్శన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య బలమైన భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తుందని అంచనా. బిల్ గేట్స్ రాష్ట్రంలో టెక్నాలజీ ఆధారిత పాలన, ప్రజా సేవల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారు.

# నగరానికి చేరుకున్న గవర్నర్, హైకోర్టు చీఫ్ జస్టిస్

## ఉక్కు ఉద్యోగులకు నోటీసులు

## సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న 146 మందికి జారీ

## మరోసారి తప్పు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరిక



**క్రైం కౌంటర్ న్యూస్,** విశాఖపట్నం, ఫిబ్రవరి 16 స్టీల్ ప్లాంటు యాజమాన్యం 146 మంది ఉద్యోగులకు హెచ్చరిక నోటీసులు జారీచేసింది. ఈ నెల 12న నిర్వమించిన సార్వత్రిక సమ్మెలో స్టీల్ ప్లాంటు ఉద్యోగులు కూడా కొందరు పాల్గొన్నారు. వారందరినీ గుర్తించి ఆ మరుసటి తేదీతో సోమవారం విడివిడిగా నోటీసులు జారీచేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు, కార్మికులు అంతా స్టీల్‌ప్లాంటు అభివృద్ధికి పాటుపడాలని సమ్మెలు, నిరసనలు వ్యక్తం చేయకూడదని సీఎండీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని అందులో గుర్తుచేసింది. సమ్మెలో పాల్గొనడం యాజమాన్యానికి వ్యతిరేకంగా పనిచేయడం కిందకే వస్తుందని స్పష్టంచేసింది. ఇంకోసారి ఇలాంటి తప్పు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. షోకాజ్ నోటీసుకు ఎక్కువగా, మెమోకు తక్కువగా ఈ నోటీసు ఉందని ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. వీటిని అందుకున్నవారు ఇకపై చిన్న తప్పు చేసినా ఉద్యోగం నుంచి తొలగించడానికి కూడా యాజమాన్యం వెనుకాడదనే వాదన వినిపిస్తోంది.

ఆరు గంటలు ఆగిన విద్యుత్ సరఫరా

స్టీల్‌ప్లాంటును ముడి పదార్థాల కొరత వేధిస్తోంది. బొగ్గుతో పాటు కోక్ కూడా తగినంత అందడం లేదు. సొంత ?థర్మల్ పవర్ ప్లాంటులో సాంకేతిక లోపాలు తలెత్తడంతో విద్యుత్ కోసం పూర్తిగా రాష్ట్ర గ్రిడ్‌పై ఆధారపడుతున్నారు. సోమవారం ఉదయం సుమారుగా ఆరు గంటలు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఉద్యోగ వర్గాలు తెలిపాయి. ఈ ప్రభావం ఉత్పత్తిపై పడింది. సింటర్ ప్లాంటులో రెండు మిషన్లు ఆగిపోయాయి. తగినన్ని వృథా వాయువులు అందక రోలింగ్ మిల్స్ కూడా నిలిచిపోయాయి. ఫిబ్రవరి నెలకు సంబంధించి ఉత్పత్తి బాగా తగ్గిపోవడంతో ఉద్యోగులకు 70 శాతానికి మించి జీతాలు వచ్చే అవకాశం లేదని అంటున్నారు. పూర్తిస్థాయిలో ముడి పదార్థాలు సరఫరాపై ఉన్నత వర్గాలు దృష్టిపెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.మహాశివరాత్రిని పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి జాగారం చేసిన భక్తులు సోమవారం ఉదయం సముద్ర స్నానాలను భారీగా తరలిరావడంతో ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి బీచ్‌లు కోలాహలంగా కనిపించాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భీమిలి వద్ద గోస్తనీ సాగర సంగమ ప్రదేశంలో భారీగా భక్తులు సముద్ర స్నానాలను ఆచరించారు.

# సాగరతీరంలో సందడి

## పూర్తిస్థాయిలో నేవీ రిహార్సల్స్

## అబ్బురపరచిన విన్యాసాలు

## బీచ్‌రోడ్డులో విదేశీ సేనల కవాతు

## నేడు రాష్ట్రపతి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాక

## సీఎం చంద్రబాబునాయుడు రాక రేపు



**క్రైం కౌంటర్ న్యూస్,** విశాఖపట్నం, ఫిబ్రవరి 16 వైమానిక దళం సాహస విన్యాసాలతో అదరహో అనిపించింది. విదేశీ సేనల కవాతుతో సాగర తీరం సరికొత్త కళ సంతరించుకుంది. నేవీ ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో పూర్తి రిహార్సల్స్‌ను నిర్వహించింది. తొలుత భారత నౌకాదళానికి చెందిన వైమానిక విభాగం తన అమ్ములపొదిలోని యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను వంతుల వారీగా గగనతలంలో మెరిపించి మురిపించింది. ఆ తరువాత శత్రుసేనలపై దాడికి దిగితే ఎలా ఉంటుందో చేతల్లో చూపించింది. జెమినీ బోట్లపై శత్రుమూకలపైకి వెళ్లడం, ఆపదలో ఉన్నవారిని హెలికాప్టర్లలో వెళ్లి రక్షించడం వంటివన్నీ కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఆఖరున ఆహ్వానిత దేశాల ప్రతినిధులు వారి వారి సంస్కృతీ సంప్రదాయాలతో కవాతు చేస్తూ బీచ్ రోడ్డులో 'పరేడ్' నిర్వహించారు. మంగళవారం సాయంత్రం కూడా మరోసారి పూర్తిస్థాయి ప్రాక్టీస్ చేయనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి.

ప్రముఖుల రాక

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) నేపథ్యంలో నగరానికి పలువురు ప్రముఖులు రానున్నారు. మంగళ, బుధవారాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు పలువురు నగరానికి వస్తున్నారు. రాష్ట్రపతి మంగళవారం సాయంత్రం 4.40 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం నేవల్ ఎయిర్ స్టేషన్ డేగాకు చేరుకుంటారు. అక్కడ ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నేవీ అధికారులు స్వాగతం పలుకుతారు. అనంతరం ఆమె నేవల్ బేస్‌కు చేరుకుని విందులో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఐఎఫ్ఆర్‌లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం నేవల్ బేస్‌కు చేరుకుని మధ్యాహ్నం ఢిల్లీ బయలుదేరి వెళతారు.

రేపు రానున్న సీఎం

ఐఎఫ్ఆర్‌లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 18న నగరానికి రానున్నారు. ఉదయం 8 గంటలకు విజయవాడలో బయలుదేరి 9.20 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి నేవల్ జెట్టీకి వెళ్లి భారత రాష్ట్రపతికి స్వాగతం పలుకుతారు. ఆమెతో పాటు ఐఎఫ్ఆర్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.20 గంటలకు విశాఖ నుంచి విజయవాడ బయలుదేరి వెళతారు.

నేడు పవన్‌కల్యాణ్ రాక

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఐఎఫ్ఆర్ వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో విశాఖ చేరుకుంటారు. సాయంత్రం ఐఎన్ఎస్ డేగా వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి రాష్ట్రపతికి స్వాగతం పలుకుతారు. రాష్ట్రపతితో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న ఆయన అనంతరం నగరంలో బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం 9.40 గంటలకు తూర్పు నౌకదళ కేంద్రానికి చేరుకుని ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఐఎన్ఎస్ డేగా వద్ద రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు.

మంత్రి రాక..

జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మంగళ, బుధవారాల్లో నగరంలో పర్యటించనున్నారు. ఐఎఫ్ఆర్‌లో పాల్గొనేందుకు వస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతారు. 18వ తేదీ రాత్రి 11.20 గంటలకు విశాఖ నుంచి రైలులో విజయవాడ వెళతారు.

ఐఎఫ్ఆర్ సేవల్లో ఫిషింగ్ బోట్లు

విదేశీ ప్రతినిధుల తరలింపునకు 100 బోట్లు

సముద్రంలో నిలిపిన నౌకల్లో చెత్తను తెచ్చేందుకు మరో 20

సముద్రంలో పహారాకు మరో రెండు...

భారత నౌకాదళం అట్టహాసంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)కు మత్స్యకారులు కూడా తమ వంతు సాయం అందిస్తున్నారు. ఈ నెల 18న జరిగే ఐఎఫ్ఆర్ కోసం 70కి పైగా దేశాల నుంచి నేవీ, కోస్టుగార్డు ప్రతినిధులు వారి నౌకల్లో విశాఖపట్నం వచ్చారు. వారంతా 19న ఆర్కే బీచ్‌లో జరిగే ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో పాల్గొని కవాతు చేస్తారు. అదేవిధంగా డాక్‌యార్డులో ఏర్పాటు చేసిన మిలాన్ విలేజ్‌ను సందర్శిస్తారు. నగరంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను చూస్తారు. వీరిని సముద్రంలో నౌకల నుంచి తీరానికి సురక్షితంగా తీసుకువచ్చి, అవసరమైనప్పుడు మళ్లీ వారిని సముద్రంలో నౌకల వద్ద దిగబెట్టే బాధ్యతలను మత్స్యకారులకు అప్పగించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 100 ఫిషింగ్ బోట్లను అద్దెకు తీసుకొని వాటిని అందంగా తీర్చిదిద్దారు. విశాఖలో ఉన్నవాటితోపాటు కాకినాడ నుంచి కొన్ని బోట్లను తీసుకువచ్చి ఈ విధులకు ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా సముద్రంలో నిలిపిన విదేశీ నౌకల్లో రోజు వారీ వచ్చే చెత్తను తీరానికి తీసుకువచ్చి డంపింగ్ చేసేందుకు మరో 20 బోట్లను ఏర్పాటు చేశారు. ఈ 120 బోట్లను ఫిషింగ్ హార్బర్‌లో నిలిపేందుకు వీలుగా 11వ నంబరు జెట్టీని ఖాళీ చేసి ఇచ్చామని మత్స్య శాఖ జాయింట్ డైరక్టర్ లక్ష్మణరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇవన్నీ 24/7 సేవలు అందిస్తున్నాయన్నారు. అదే విధంగా ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు సముద్రంలో నేవీ నౌకలు విన్యాసాలు చేయనున్నందున తీర ప్రాంతంలోని మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని ముందుగానే సమావేశాలు పెట్టి హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా అలా వెళితే వెంటనే గుర్తించి, వెనక్కి తీసుకువచ్చేందుకు మరో రెండు మెకనైజ్డ్ బోట్లను పెట్రోలింగ్‌కు ఉపయోగిస్తున్నామని లక్ష్మణరావు తెలిపారు.

# అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో భారీ సుడిగాలి.. భయపడిపోయిన యువకులు



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 16:** అనకాపల్లి జిల్లాలో సుడిగాలి భయాందోళనకు కారణమైంది. అనకాపల్లిలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం సుడిగాలి దుమారం రేపింది. సుమారు అరగంట పాటు బీభత్సం సృష్టించింది. సోమవారం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంలో కొంతమంది యువకులు క్రికెట్ ఆడుతున్న సమయంలో.. ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి.. సుడిగాలి రావటంతో యువకులు కంగారుపడిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సుమారుగా వంద అడుగుల ఎత్తులో సుడులు తిరుగుతూ, ఆకాశాన్ని తాకుతోందా అన్నట్లుగా తీవ్రంగా గాలి వీయటంతో స్థానికులు కూడా కంగారుపడిపోయారు. గతంలో ఇలాంటి పరిణామం ఎప్పుడూ చూడలేదంటున్నారు.

మరోవైపు దీనినే డస్ట్ డెవిల్, టోర్నడో, ట్విస్టర్ అని వివిధ పేర్లతో కూడా పిలుస్తుంటారు. ముఖ్యంగా అమెరికాలో ఇలాంటివి చోటుచేసుకుంటూ ఉంటాయి. అయితే అమెరికాలో విరుచుకుపడే టోర్నడోలు భారీగా నష్టాన్ని కలిగిస్తూ ఉంటాయి. ప్రాణ నష్టం కూడా జరుగుతూ ఉంటుంది. ఇలాంటి సుడిగాలులు ఏర్పడటానికి అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు. క్యుములోనింబస్ మేఘాలు, అలాగే మేఘాల కింద ఉండే ధూళి వంటి వ్యర్థాల నుంచి టోర్నడోలు పుట్టుకొస్తాయని చెప్తున్నారు. ఏర్పడిన చోటు నుంచి వందల కిలోమీటర్ల వేగంతో.. కొన్ని కిలోమీటర్ల దూరం ఇవి ప్రయాణిస్తాయని.. ఆ మార్గంలో విధ్వంసం సృష్టిస్తాయని వివరిస్తున్నారు.

అసాధారణ స్థాయిలో వేడి పరిస్థితులు ఉన్నప్పుడు ఇలాంటి సుడిగాలులు ఏర్పడుతాయని నిపుణులు చెప్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు తేమతో కూడిన గాలి వేడెక్కి పైకి లేస్తుందని వివరిస్తున్నారు. శీతాకాలంలో గాలిలో వేడి, తేమ శాతం పెద్దగా ఉండదు కావున టోర్నడోలు వచ్చే అవకాశం తక్కువని.. ఎండాకాలంలో ఇవి ఏర్పడుతుంటాయని చెప్తున్నారు. మరోవైపు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఎక్కువగా టోర్నడోలు సంభవిస్తుంటాయి. ఇక్కడ ఏటా 140 వరకూ టోర్నడోలు ఏర్పడుతుంటాయని అంచనా. అమెరికా తర్వాతా కెనడాలో ఎక్కువగా టోర్నడోలు సంభవిస్తూ ఉంటాయి. మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, తూర్పు చైనా ప్రాంతాల్లోనూ ఇలాంటివి చూస్తుంటాం. అంటార్కిటికా మినహా అన్ని ఖండాల్లోనూ ఇవి ఏర్పడుతుంటాయి.

# రేపటి సూర్యగ్రహణం.. గర్భిణీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు..

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 16:** రేపు ఏర్పడనున్న సూర్యగ్రహణం పట్ల భారతీయ గర్భిణీ స్త్రీలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ప్రముఖ జ్యోతిష్య పండితులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా గ్రహణ సమయాల్లో గర్భిణీలు పాటించాల్సిన కఠిన నియమాలపై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తుంటాయి. అయితే, ఈ సూర్యగ్రహణం భారతదేశంలో ఎక్కడా కనిపించదు కాబట్టి, మన దేశ ప్రజలపై దీని ప్రభావం ఉండదని వారు భరోసా ఇస్తున్నారు. శాస్త్రం ప్రకారం, గ్రహణం ఎక్కడైతే కనిపిస్తుందో అక్కడి ప్రజలకు మాత్రమే నియమాలు వర్తిస్తాయని వారు గుర్తు చేస్తున్నారు.

ఈ గ్రహణం రేపు మధ్యాహ్నం 3:26 గంటలకు ప్రారంభమై రాత్రి 7:57 గంటల వరకు కొనసాగనుంది. ఇది సుదీర్ఘ సమయం పాటు

3లో



# పేదల ఇళ్ల నిర్మాణానికి తక్కువ స్టీలు, సిమెంటు వినియోగం

**ఇసుక వినియోగంలో భారీ గోల్‌మాల్**

**చేసిన పనుల కంటే ఎక్కువగా బిల్లులు**

**రూ.22.77 కోట్లు రికవరీకి విజిలెన్స్ సిఫారసు**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 16 నగర శివారు ప్రాంతాల్లో గల ఐదు లేఅవుట్‌లలో పేదల ఇళ్ల నిర్మాణం చేపట్టిన 'రాక్‌ట్రీ' సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. గత ప్రభుత్వ హయాంలో పాలకుల దన్ను ఉండడంతో చేసిన పని కంటే ఎక్కువ బిల్లులు డ్రా చేసింది. అలాగే ఇనుము, సిమెంట్, ఇసుక వంటివి అదనంగా తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ బిల్లులు, మెటీరియల్ డ్రా చేసిన రాక్‌ట్రీ ఏజెన్సీ అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం ఐదు లేఅవుట్‌లలో చేపట్టిన నిర్మాణాలకు, రికార్డుల్లో ఉన్న వివరాలకు తేడా ఉందని గుర్తించి రూ.22.77 కోట్లు రికవరీ చేయాలని నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో రాక్‌ట్రీ ఏజెన్సీపై క్రిమినల్ కేసు చేయాలని హౌసింగ్ అధికారులకు ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు.

గత ప్రభుత్వంలో రాక్‌ట్రీ ఏజెన్సీకి పైడివాడ అగ్రహారం, నంగినారపాడు, గొల్లలపాలెం, గంగవరం, నడుపూరుల్లో 14,627 ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. వీటిలో పైడివాడ అగ్రహారంలో మోడల్‌గా ఒక ఇంటిని మాత్రమే సంస్థ నిర్మించింది. పైడివాడ అగ్రహారంలో 6,412 ఇళ్లకు 6,102, నంగినారపాడులో 1,533కి 1,456, గంగవరంలో 1,718కి 1,691, గొల్లలపాలెంలో 1,563కి 1,563, నడుపూరులో 3,401కి 3,207...మొత్తం 14,627కి 14,021 ఇళ్ల నిర్మాణం ఈ సంస్థ ప్రారంభించింది. ఈ సంస్థ చేపట్టిన పనులపై ఫిర్యాదులు అందడంతో విశాఖతోపాటు రాష్ట్రంలో మరికొన్ని జిల్లాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2024లోనే తనిఖీలు చేపట్టారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరుచేసిన ఈ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు కూడా కేంద్రం రూపొందించిన మార్గదర్శకాల మేరకు ఇవ్వాలి. దీనికి భిన్నంగా ప్రతి ఇంటికి రూ.ఐదు వేల నుంచి రూ.20 వేల వరకు అడ్వాన్స్ కింద రాక్‌ట్రీ ఏజెన్సీకి అప్పటి అధికారులు ఇచ్చినట్టు విజిలెన్స్ బృందం గుర్తించింది. ఐదు లేఅవుట్‌లలో మెటీరియల్, సొమ్ములు కలిపి 14,021 ఇళ్లకు రూ.263.28 కోట్లు చెల్లించాలి. అయితే రాక్‌ట్రీ ఏజెన్సీ 2024లో పనులు నిలిపివేసే సమయానికి బిల్లుల కింద రూ.60.12 కోట్లు తీసుకుంది. మొత్తం 4,929 ఇళ్లకు సంబంధించి అసలు కంటే అదనంగా రూ.5.88 కోట్లు ఇచ్చినట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించింది. అలాగే ఇనుము, సిమెంట్ చాలా తక్కువ వినియోగించింది. బిల్లులు మాత్రం రూ.5.01 కోట్లు అదనంగా తీసుకుంది. ఆ మొత్తం కూడా రికవరీ చేయాలని విజిలెన్స్ పేర్కొంది. అదేవిధంగా ఇళ్ల నిర్మాణాల కోసం 16,957 ఇసుక కూపన్లు (అంటే 84,785 టన్నుల ఇసుక) జారీచేయగా వాటిలో 36,412 టన్నులు వినియోగించిన రాక్‌ట్రీ మిగిలిన 48,373 టన్నులకు లెక్కలు చెప్పలేదు. ఇదిలావుండగా ఇళ్ల నిర్మాణాలు జరిగినట్టు ఆన్‌లైన్‌లో నమోదుచేసిన వివరాలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పనులు ఉన్నట్టు నిర్ధారించారు. చేసిన పనుల కంటే ఎక్కువగా రూ. 11.87 కోట్లు చెల్లించారు. ఈ మొత్తం రికవరీ చేయాలని సూచించింది. మొత్తం 14,021 ఇళ్లలో 7,460 ఇళ్లు పునాదుల వరకు, 5,890 ఇళ్లు బేస్‌మెంట్ వరకు, 29 ఇళ్లు గోడల వరకు, 425 ఇళ్లు స్లాబ్ లెవెల్‌కు, 145 ఇళ్లకు స్లాబ్ వేశారు. మొత్తమ్మీద లెక్కించి రూ.22.77 కోట్లు రాక్‌ట్రీ నుంచి రికవరీ చేయాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలో సాధారణంగా చేపట్టే మట్టి నమూనా పరీక్షలను కూడా హౌసింగ్ అధికారులు చేపట్టలేదని విజిలెన్స్ తన నివేదికలో తప్పుబట్టింది.

# ఇక్కడా.. ఉక్కు.. తుక్కే!

**నాలుగేళ్లుగా జిల్లా వ్యాప్తంగా 860 టన్నుల ఇనుము వృథాగా ..**

**చాలాచోట్ల వానలకు తడిసి తుప్పు..**

**గత ప్రభుత్వ హయాంలో కమీషన్ల కోసం కక్కుర్తి**

**అవసరం లేకపోయినా భారీగా కొనుగోలు**

**ఏఎంసీ నుంచి ఐరన్‌ను తొలగించండి..**

**జిల్లా అధికారులకు లేఖ**



క్రైం కౌంటర్ న్యూస్, నరసాపురం, ఫిబ్రవరి 16 గత ప్రభుత్వ హయాంలో జగ నన్న కాలనీల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. పేదలకు గూడు పేరుతో ఇళ్లు నిర్మించకుండానే అయినకాడికి దోచేశారు. పేరుకు సెంటు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించకుండా కోట్లు దోచేశారు. ఐరన్ నుంచి సిమెంట్, ఇంటి సామాగ్రి కొనుగోళ్లలో కోట్ల రూపాయలు కమీషన్లు కొట్టేశారు. అవసరం లేక పోయినా పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ఉపయోగించ కుండా వదిలేయడంతో కోట్లాది రూపాయిల ప్రభుత్వం సొమ్ము వృథా అయింది. రాష్ట్రవ్యాప్తంగా వంద కోట్ల విలువైన 16 వేల టన్నుల స్టీల్‌కు తుప్పు పట్టగా జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. జగనన్న కాలనీ పేరుతో చేపట్టిన ఈ అవినీతి నేడు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అవసరం లేక పోయినా పెద్ద ఎత్తున ఐరన్ కొనుగోలు చేయడం వల్ల జిల్లాలో సుమారు 860 టన్నుల నాలుగేళ్లుగా ఆరుబయటే పడి ఉంది. ఎండ, వానలకు తడవడం వల్ల చాలా చోట్ల ఇనుప ఊచలు తుప్పు పట్టాయి. భీమవరం సబ్ డివిజన్‌లో 274 టన్నులు, నరసాపురంలో 249, తణుకు 148, ఉండి 69, పాలకొల్లు 10, ఆచంట 110, టీపీ గూడెంలో 10 టన్నుల ఐరన్ ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడికక్కడ పడి ఉన్న ఐరన్‌ను సబ్ డివిజన్ల వారీగా ఒక చోట భద్రపర్చింది. కొనుగోలు చేసిన ఐరన్ క్వాలిటీని ల్యాబ్‌లో పరీక్షించింది. ఇలా వృథాగా ఉన్న ఐరన్‌లో 8 ఎంఎం, 10 ఎంఎం, 12 ఎంఎం ఉన్నాయి.

ఇళ్లు పేరుతో కొనుగోళ్లు

గత ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 72 వేల గృహాలు మంజూరయ్యాయి. వీరిలో 11 వేల మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. దీనికి సంబం? దించి ఒక్కొక్క ఇంటికి రూ 2.16 లక్షలు చెల్లించే విధంగా ప్రైవేట్ ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తంలో రూ 1.80 లక్షలు కేంద్రం ఇచ్చే రుణం కాగా మిగిలిన రూ 30 స్వయం సహాయక సంఘం నుంచి లబ్ధిదారులకు అందిస్తారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారుడు ఇళ్లు నిర్మించే ఏజెన్సీకి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఇళ్లు నిర్మించే ఏజెన్సీకి ప్రభుత్వం ఐరెన్, సిమెంట్‌తో పాటు ఇతర మెటీరియల్స్‌ను సబ్సిడీపై అందిస్తామని హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా పెద్ద మొత్తంలో ఐరన్, సిమెంట్, ఇతర మెటీరియల్ కొనుగోలు చేసి ఏజెన్సీలకు పంపిణీ చేసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా 860 టన్నులను ఏజెన్సీలకు అప్పగించింది. నిబంధనల ప్రకారం లేబర్, మిషనరీని ఉపయోగించి ఏజెన్సీ ఇళ్లు నిర్మించి అప్పగించాల్సి ఉంది. అయితే మొదట్లో ఉత్సాహంగా కట్టేందుకు ముందుకొచ్చిన ఏజెన్సీలు ఆ తరువాత గిట్టుబాటు కావడం లేదన్న సాకుతో వెనక్కి తగ్గాయి. కొన్నిచోట్ల బేస్‌మెంట్‌లు వేసి చేతులు దులుపుకున్నాయి. ప్రభు త్వమే మెటిరీయల్ కొనుగోలు చేసి అప్పగించడం వల్ల తమకు లాభాసాటిగా లేదని వెనక్కి తగ్గాయన్న వాదనలు అప్పట్లో వినిపించాయి. ఇటీవల ఆర్డీవో దాసిరాజుకు మాజీ సర్పంచ్ రంగారావు ఐరన్ తుప్పు పడుతుందని, దీన్ని భద్రపర్చాలని వినతిపత్రం అందించారు.

చాలా ఐరన్ నాసిరకమే

ఇక జిల్లాకు సరఫరా అయిన ఐరన్‌లో చాలా శాతం నాసిరకమైందన్న వాదనలు అధికారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. బ్రాండెండ్ కంపెనీ నుంచి కొనుగోలు చేస్తే పెద్ద మొత్తంలో కమీషన్లు రావని భావించి తక్కువ ధరకు కొని వీటిని ఎక్కువ ?ధర కోడ్ చేశారన్న వాదనలు కూడా ఉన్నాయి. అప్పట్లో వచ్చిన ఈ ఆరోపణలపై జిల్లా అధికారులు ఐరెన్ క్వాలిటీని ల్యాబ్‌కు పంపి పరీక్ష కూడా చేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తరహా ఉండటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు ఇప్పటి వరకు ఈ ఐరెన్‌ను దేనికి వినియోగించకుండా భద్రంగా ఉంచారు.

జిల్లా అధికారులకు లేఖ రాశాం

జక్కం శ్రీమన్నారాయణ, ఏఎంసీ చైర్మన్

నాలుగేళ్లుగా ఏఎంసీ కార్యాలయంలో ఐరెన్ వృథాగా పడి ఉంది. ఇటీవల పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ఐరెన్‌ను మార్కెట్ యార్డు నుంచి మరో చోటకు తరలించాలని జిల్లా అధికారులకు లేఖం రాశాం. వర్షం వస్తే యార్డు మునిగి పోతుంది. దీనివల్ల ఐరెన్ అంతా తుప్పు పట్టింది. ఉన్న ఐరెన్‌కు రక్షణ లేదు. అయితే ఇంతవరకు అధికారులు దీనిపై స్పందించ లేదు.

# కిరాక్ ఆర్పీకి వైసీపీ నేత వార్నింగ్



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 16: కమెడియన్, టీడీపీ మద్దతుదారుడు కిరాక్ ఆర్పీ మీద వైసీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి, వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను అనుకరిస్తూ కిరాక్ ఆర్పీ మాట్లాడిన మాటలు, తీరుపై వైసీపీ నేతలు, కార్యకర్తలు మండిపడుతున్నారు. కిరాక్ ఆర్పీ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగ మల్లేశ్వరి .. కిరాక్ ఆర్పీపై విరుచుకుపడ్డారు. కిరాక్ ఆర్పీకి వార్నింగ్ ఇచ్చారు. తీరు మార్చుకోకుంటే 2029లో ఆలయాల ముందు అడుక్కుతినే రోజులొస్తాయంటూ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

" కిరాక్ ఆర్పీ.. ఒళ్లు బలిసి మాట్లాడుతున్నావ్. ఎవరిని పడితే వాళ్లను, ఏదిపడితే అది మాట్లాడుతున్నావ్. కాస్త ఒళ్లూ, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు. లోపాలుంటే చెప్పటంలో తప్పులేదు. కానీ వ్యక్తిలోని లోపాన్ని అవహేళన చేస్తూ నువ్వు చేస్తున్న యాక్టింగ్, రాబోయే రోజులలో నీకు ప్రాక్టీస్ అవుతుంది. బొత్స గారి గురించి మాట్లాడే అర్హత నీకుందా. ఆయన చిటికెన వేలి మీద ఉన్న వెంట్రుకతో కూడా నువ్వు సమానం కాదు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా నీ గురించి ఎందుకులే అనుకున్నా. కానీ చాలా శ్రుతిమించిపోయావ్. జాగ్రత్త."

"ఉత్తరాంధ్ర ప్రాంతానికి వస్తే సొరకు ఎరేసినట్లు వేసేస్తారు. ఎవరిని చూసి మాట్లాడుతున్నావ్. కోటీ 32 లక్షల మంది తొక్కిపట్టి నార తీసే రోజు వస్తుంది. కంట్రోల్‌గా ఉండు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మర్యాదగా ఉంటే బాగుంటుంది. మరోసారి వైసీపీ నేతలపై ఇష్టానుసారం మాట్లాడితే.. ఇప్పుడు చేసే యాక్టింగ్ నిజమవుద్ది. ఏ గుళ్ల ముందో, రైల్వేస్టేషన్ల ముందో, బస్టాండ్ల వద్దో అడుక్కుంటావ్.. నోరు, ప్రవర్తన అదుపులో పెట్టుకో." అంటూ వైసీపీ నేత నాగ మల్లేశ్వరి వార్నింగ్ ఇచ్చారు.

అయితే కిరాక్ ఆర్పీ మాట్లాడిన మాటలపై సోషల్ మీడియా వేదికగానూ వైఎస్ష?స్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భగ్గుమంటున్నారు. అధికార పార్టీ అండతో ఇష్టానుసారం పేట్రేగి మాట్లాడుతున్నారని.. 2029 ఎన్నికల తర్వాత అసలు సినిమా చూపిస్తామంటూ కామెంట్లు పెడుతున్నారు. సీనియర్ రాజకీయ నేతపై అలాంటి అనుచిత వ్యాఖ్యలు తగదని మరికొందరు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మొత్తంగా కిరాక్ ఆర్పీ వ్యవహారంతో సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ వైసీపీ కార్యకర్తల మధ్య ట్వీట్ల యుద్ధం జరుగుతోంది.

# పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు

**జనసంద్రంగా మారిన సముద్ర, నదీ తీరాలు**

**కల్యాణపులోవకు రెండో రోజు మరింత తాకిడి**



క్రైం కౌంటర్ న్యూస్, న్యూస్ నెట్‌వర్క్) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి జాగారం చేసిన భక్తులు సోమవారం ఉదయం సమీపంలోని సముద్రం, నదులు, జలాశయాలు, గెడ్డల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో ఆయా ప్రదేశాలు భక్తజనసంద్రంగా మారాయి. రావికమతం మండల కల్యాణపులోవ జలాశయం, పోతురాజుబాబు ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు ఆదివారం రాత్రి ఇక్కడ జాగరణ చేశారు. వీరితోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సోమవారం వేకువజాము నుంచి రిజర్వాయర్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకున్నారు. కాగా కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఉదయం ఇక్కడకు వచ్చి పోతురాజుబాబును దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టం ఉత్తరవాహినికి సోమవారం వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఉత్తరవాహిని వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తీరంలో కొలువై వున్న మల్లికార్జునస్వామిని దర్శించుకొన్నారు.గొలుగొండ మండలం ధారమఠంలోని ఉమాధారమల్వీశ్వరస్వామి ఆలయానికి సోమవారం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిచ్చారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి ముందు సమీపంలోని జలపాతంలో స్నానాలు చేశారు. సుమారు 50 వేల మంది భక్తులు వచ్చినట్టు దేవదాయ శాఖ అధికారులు చెప్పారు.మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి జాగరణ చేసిన భక్తులు సోమవారం ఉదయం రాంబిల్లి మండలం పంచదార్ల పుణ్యక్షేత్రంలో ఆకాశ ధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఫణిగిరిపై ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.పాయకరావుపేట మండలంలోని పెంటకోట, రాజవరం, రాజానగరం, రత్నాయమ్మపేట, పాల్మన్‌పేట గ్రామాల వద్ద సముద్ర తీరంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. అనంతరం సమీంలోని ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కొనసాగినప్పటికీ, మన దేశ భౌగోళిక పరిధిలో దీని ఛాయలు కనిపించవు. కావున, గర్భిణీ స్త్రీలు గ్రహణ సమయంలో ఇంట్లోనే ఉండాలని, కిటికీలు మూసివేయాలని లేదా పదునైన వస్తువులను ముట్టుకోకూడదని చెప్పే పాత ఆచారాలను పాటించాల్సిన అవసరం లేదు. ఎప్పటిలాగే ప్రశాంతంగా ఉండటం వల్ల మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండవచ్చని పండితులు సూచిస్తున్నారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా గర్భిణీలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన పనిలేదు. గ్రహణ సమయం కాబట్టి ఉపవాసం ఉండాలని లేదా ఆహారం తీసుకోకూడదని నియమాలు పెట్టుకోవడం వల్ల గర్భిణీలకు నీరసం వచ్చే అవకాశం ఉంటుంది. మన దగ్గర గ్రహణం ప్రభావం లేదు కాబట్టి, వారు ఎప్పటిలాగే పౌష్టికాహారాన్ని తీసుకోవచ్చు మరియు తమ రోజువారీ పనులను యధావిధిగా చేసుకోవచ్చు. గర్భిణీ ఆరోగ్యమే శిశువుకు ముఖ్యం కాబట్టి, ఆహారం విషయంలో ఎటువంటి ఆంక్షలు పెట్టుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి, ఈ సూర్యగ్రహణం వల్ల భౌతికంగా కానీ, ఆధ్యాత్మికంగా కానీ మన దేశంలో ఎటువంటి దోషాలు వర్తించవు. గర్భిణీలు ఈ సమయాన్ని ఒక సాధారణ రోజులాగే గడపవచ్చు. అనవసరమైన భయాలను మనసులోకి రానివ్వకుండా ఉండటమే మంచిది. శాస్త్రీయంగా మరియు జ్యోతిష్యపరంగా కూడా మన దగ్గర ప్రభావం లేదు కాబట్టి, ఎలాంటి పూజలు లేదా పరిహారాలు చేయాల్సిన అవసరం కూడా లేదని పండితులు మరోసారి తేల్చి చెబుతున్నారు.

# సినిమా



## చిరు, బాలయ్య, వెంకీలతో బ్లాక్ బస్టర్ అందుకుంది..

ఒకప్పుడు ఇండస్ట్రీలో తిరుగులేని హీరోయిన్ ఆమె.. ఎంతో మంది స్టార్ హీరోల సరసన సినిమాలు చేసి మెప్పించింది. తెలుగు, తమిళ్ , కన్నడ భాషల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా తెలుగులో ఎన్నో సూపర్ హిట్ అందుకుంది. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది ఆ అందాల తర్వాత. పై ఫొటోలో ఉన్న చిన్నారుల్లో ఆమె ఎక్కడ ఉందో.? ఆమె ఎవరో కనిపెట్టండి చూద్దాం.! చాలా మంది హీరోయిన్స్ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ ఉంటాయి. స్టార్ హీరోయిన్స్ చిన్ననాటి ఫోటోలు సోషల్ మీడియాలో నిత్యం వైరల్ అవుతూ ఉంటాయి. ఫ్యాన్స్ తమ అభిమాన హీరోయిన్స్ ఫోటోలను నెట్టింట తెగ షేర్ చేస్తూ ఉంటారు.హీరోయిన్స్ చిన్ననాటి ఫోటోలు, లేటెస్ట్ ఫోటో షూట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ హీరోయిన్ కు సంబంధించిన స్కూల్ డేస్ ఫోటో చక్కర్లు కొడుతుంది. పై ఫొటోలో ఉన్న స్టార్ హీరోయిన్ ను గుర్తుపట్టారా.? ఒకప్పుడు ఆమె కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్. ఇప్పటికీ తరగని అందంతో దూసుకుపోతోంది ఈ ముద్దుగుమ్మ. ఇంతకూ ఆమెను కనిపెట్టారా.? ఆమె మరెవరో కాదు.. అప్పటికీ ఇప్పటికీ కుర్రాళ్లను తన అందంతో కట్టేస్తున్న వయ్యారి భామ మీన. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది.మీనా చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలు పెట్టింది. సినిమా ఇండస్ట్రీలో మీనా 40 ఏళ్లకు పైగా ఉన్నారు. తెలుగులో ఆమె ఎంతో మంది సూపర్ స్టార్స్ తో నటించింది. వెంకటేష్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున ఇలా చాలా మంది స్టార్స్ తో నటించింది. ఇటీవలే మీనా భర్త కన్నుమూశారు. ఇక మీనా ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. కానీ బుల్లితెరపై పలు రియాల్టీ షోలకు జడ్జీగా వ్యవహరిస్తుంది మీనా. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది రెగ్యులర్ గా తన ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మీనా అప్పటికీ ఇప్పటికీ అదే అందంతో.. అలానే ఉన్నారు.





## బరువు తగ్గేందుకు, ఫిట్‌గా ఉండేందకు ఒక రోజులో ఎన్ని చపాతీలు తినాలి!

సాధారణ గోధుమలతో తయారు చేసిన చపాతీలో 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 70-80 కేలరీలు, 3 గ్రాముల ప్రొటీన్, కొద్ది మొత్తంలో ఫైబర్ ఉంటాయి. ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది, ప్రొటీన్ జీవక్రియకు మద్దతు ఇస్తుంది. ఇంకా చపాతీని ఇతర పిండితో కలిపి తయారు చేస్తే, అది మరింత ఆరోగ్యంగా ఉంటుంది. కాబట్టి మనం ఆరోగ్యం ఉండటానికి, బరువు నియంత్రణలో ఉండటానికి రోజుకూ ఎన్ని చపాతీలు తినాలి, ఏ సమయంతో తినాలో ఆరోగ్య నిపుణుల ప్రకారం తెలుసుకుందాం.

ఒక రోజులో ఎన్ని చపాతీలు తినాలి?

మీరు ఒక రోజులో ఎన్ని చపాతీలు తినాలి అనేది మీ వయస్సు, బరువు, ఎత్తు, రోజువారీ శారీరక శ్రమ, ఫిట్‌నెస్ లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి ఒక భోజనంలో 2 నుండి 4 మధ్య తరహా గోధుమ చపాతీలను తినవచ్చు. దీని అర్థం రోజుకు 6 నుండి 12 చపాతీలు, కానీ ఇది పూర్తిగా వ్యక్తిగత అవసరాలు, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి 55-65 కిలోల బరువు ఉండి కూర్చొని పనిచేస్తే లేదా తేలికైన పని చేస్తే, రోజుకు 3-4 చపాతీలు సరిపోతాయి. అదే సమయంలో, 65-75 కిలోల బరువు ఉండి మధ్యస్తంగా చురుకుగా ఉండేవారు 4-5 చపాతీలు తినవచ్చు. ఎవరైనా 75 కిలోల కంటే ఎక్కువ బరువు ఉంటే లేదా కఠినమైన పని లేదా వ్యాయామం చేస్తే, వారు రోజుకు 5-6 చపాతీలు తినవచ్చు, ఎందుకంటే వారి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది.

బరువు తగ్గడానికి రోజుకు ఎన్ని చపాతీలు తినాలి?

సాధారణంగా, ఒక చిన్న చపాతీలో దాదాపు 80-85 కేలరీలు ఉంటాయి. ఇందులో దాదాపు 15-18 గ్రాముల కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. మీరు మధ్యాహ్న భోజనానికి దాదాపు 300-400 కేలరీలు తినాలనుకుంటే, మీరు రెండు చపాతీలు తినవచ్చు. రెండు చపాతీలు సుమారు 160 కేలరీలు, 24-30 గ్రాముల కార్బోహైడ్రేట్లను అందిస్తాయి. అదనంగా, మీరు చపాతీలతో తినే కూరగాయలు లేదా పండ్లు కూడా కొన్ని కేలరీలను కలిగి ఉంటాయి. అందువల్ల, బరువు తగ్గడానికి మీరు రోజుకు తినవలసిన చపాతీల సంఖ్య మీ మొత్తం కేలరీల అవసరాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, బరువు తగ్గడానికి రోజుకు 3-4 చపాతీలు సరిపోతాయని భావిస్తారు.

అయితే కేవలం చపాతీల సంఖ్యను లెక్కించడం మాత్రమే సరిపోదు. మీ ప్లేట్‌లో ఎలాంటి ఆహారం ఉందనేది పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. చపాతీలను పప్పుధాన్యాలు, పెరుగు, జున్ను లేదా కూరగాయలతో కలిపి తిన్నప్పుడు, అవి శరీరానికి ప్రొటీన్, ఫైబర్, అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇది జీర్ణక్రియను నెమ్మదింపజేయడానికి, కడుపు ఎక్కువసేపు నిండుగా ఉంచడానికి, తరచుగా ఆకలి బాధలను తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా మీరు త్వరగా బరువు తగ్గేందుకు సహాయపడుతుంది.



## శీతాకాలంలో ఈ తప్పులు మీరూ చేస్తున్నారా?

శీతాకాలంలో ఆహారం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. ఈ కాలంలో సాధారణంగా చాలా మంది వేసవిలో కంటే ఎక్కువ ఆహారం తీసుకుంటూ ఉంటారు. ముఖ్యంగా వేయించిన ఆహారాలు, స్వీట్ల వినియోగం తెలియకుండానే పెరుగుతుంది. కానీ ఈ రకమైన ఆహారాలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ త్వరగా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు కొలెస్ట్రాల్ పెరగడానికి గల కారణాలు ఏమిటి? ఈ సమయంలో ప్రజలు ఎందుకు ఎక్కువ ఆహారం తీసుకుంటారు? శీతాకాలంలో ఏ రకమైన ఆహారాలు తినకూడదు వంటి వివరాలు ఈ కింద తెలుసుకుందాం..శీతాకాలంలో కొలెస్ట్రాల్ పెంచే ఆహారాలు ఇవే..

నెయ్యి ఎక్కువగా ఉండే ఆహారాలు

ఏదైనా కూరలో నెయ్యి వేసి వేడి చేసి తినడం చాలా హానికరం. ఎందుకంటే ఇందులో చాలా సంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో నెయ్యిని పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. నెయ్యి కాకుండా సమోసాలు, కచోరి, పకోడీలు వంటి వేయించిన ఆహారాలను వీలైనంత వరకు నివారించాలి. శుద్ధి చేసిన నూనెను ఎక్కువగా వాడటం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది.

రెడ్ మీట్

శీతాకాలంలో రెడ్ మీట్‌ను పెద్ద మొత్తంలో తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ఇందులో అధిక మొత్తంలో కొవ్వు, కొలెస్ట్రాల్ ఉంటాయి. కాబట్టి దీనిని మితంగా తీసుకోవాలి. మీకు గుండె సంబంధిత సమస్యలు ఉంటే, దీనిని తినకపోవడమే మంచిది. అలాగే శీతాకాలంలో ఎక్కువ చక్కెర తీసుకోవడం మానుకోవాలి.

శీతాకాలంలో గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయాలు

ప్రతిరోజూ 30 నిమిషాలు వాకింగ్, తేలికపాటి వ్యాయామం చేయాలి.

మీ ఆహారంలో ఆకుపచ్చ కూరగాయలు, పండ్లను చేర్చుకోవాలి.

కనీసం నెలకు ఒకసారి కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేసుకోవాలి.

## ఆఫ్రిదికి అధికారం ఉంటేనట..

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ 61 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ ఫలితం మాత్రమే కాదు, పాక్ క్రికెట్ పునాదులను కదిలించేలా ఉంది. టీమిండియా నిర్దేశించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో పాక్ బ్యాటర్లు చేతులెత్తేయడంపై ఆ దేశ మాజీ క్రికెటర్లు నిప్పులు చెరుగుతున్నారు. బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది వంటి దిగ్గజాలపై తీవ్ర విమర్శలు రావడమే కాకుండా, వారిని జట్టు నుంచి శాశ్వతంగా తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది ఈ ఓటమిపై స్పందిస్తూ చాలా కఠినమైన వ్యాఖ్యలు చేశారు. “జట్టు ఎంపికలో నా చేతిలో అధికారం ఉంటే బాబర్ అజామ్, షాదాబ్ ఖాన్, షాహీన్ అఫ్రిదిలను వెంటనే జట్టు నుంచి తప్పించేవాడిని. వారికి ఇప్పటికే చాలా అవకాశాలు ఇచ్చాం, కానీ కీలక సమయాల్లో వారు పదేపదే విఫలమవుతున్నారు. సీనియర్లు ఫలితాలను ఇవ్వనప్పుడు, బెంచ్‌పై ఉన్న యువకులను ఎందుకు ఆడించకూడదు?” అని ప్రశ్నించారు. బాబర్ అజామ్ జట్టుకు భారంలా మారాడనే అర్థం వచ్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి.

పాక్ క్రికెట్ దిగ్గజం జావెద్ మియాందాద్ మాట్లాడుతూ.. పెద్ద మ్యాచుల్లో ఆటగాళ్లకు ఉండాల్సిన క్యారెక్టర్ పాక్ క్రికెటర్లలో కనిపించలేదన్నారు. టీమ్ మేనేజ్మెంట్ తీసుకున్న ఆరుగురు స్పిన్నర్ల నిర్ణయం కూడా ఘోర తప్పిదమని ఎత్తిచూపారు. మరో మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ అయితే.. పాక్ క్రికెట్‌లో రాజకీయ జోక్యం, వ్యక్తిగత ఎజెండాల వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. బలహీనమైన జట్లపై గెలిచి గొప్పలు చెప్పుకోవడం కాదు, భారత్ వంటి జట్లపై ఆడినప్పుడే అసలు సత్తా తెలుస్తుంది. షాహీన్, బాబర్‌ల సమయం ముగిసింది అని ఆయన  వేదికగా ధ్వజమెత్తారు. రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ ఎప్పటిలాగే తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. బాబర్ అజామ్‌ను విరాట్ కోహ్లీతో పోల్చడంపై మండిపడుతూ.. కోహ్లీ తన వారసత్వాన్ని తానే నిర్మించుకున్నాడు. కానీ బాబర్ మాత్రం ఒక్క మ్యాచ్ కూడా గెలిపించలేకపోతున్నాడు. మీరు ఒక సూపర్ స్టార్?ను తయారు చేశారు, కానీ అతడికి మ్యాచ్ గెలిపించే సత్తా లేదని దుయ్యబట్టారు. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీని కూడా అసమర్థుడు అని అక్తర్ అభివర్ణించడం గమనార్హం.

పాక్ క్రికెటర్ అహ్మద్ షెహజాద్ కూడా బాబర్ అజామ్ ప్రదర్శనపై పెదవి విరిచారు. భారత్‌పై బాబర్ మరోసారి అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. బహుశా టీ20 ఫార్మాట్‌లో బాబర్‌కు ఇదే చివరి మ్యాచ్ కావచ్చేమో అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న బాబర్‌ను జట్టులో కొనసాగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.




## రషీద్ ఖాన్ సేన నయా రికార్డు

టీ20 ప్రపంచకప్ 2026లో అఫ్గానిస్థాన్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. సోమవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన కీలక పోరులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పై 5 వికెట్ల తేడాతో రషీద్ ఖాన్ సేన ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో అఫ్గాన్లు తమ సూపర్-8 ఆశలను సజీవంగా ఉంచుకున్నారు. ఒకవేళ ఈ మ్యాచ్‌లో ఓడిపోయి ఉంటే టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చేది. నిన్న భారత్ చేతిలో పాకిస్థాన్ ఓడిపోవడంతో సంబరాలు చేసుకున్న అఫ్గాన్ అభిమానులకు, నేడు తమ జట్టు గెలుపు మరింత జోష్ ఇచ్చింది. టాస్ గెలిచిన అఫ్గానిస్థాన్ జట్టు మొదట యూఏఈని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అఫ్గాన్ పేసర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో యూఏఈ బ్యాటర్లను వణికించాడు. కేవలం 15 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి యూఏఈ నడ్డి విరిచాడు. యూఏఈ ఆటగాళ్లలో శోయబ్ ఖాన్ (68), అలీషాన్ షరాఫు (40) మాత్రమే రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేయగలిగింది. ముజీబ్ ఉర్ రెహ్మాన్ రెండు వికెట్లు తీయగా, కెప్టెన్ రషీద్ ఖాన్ ఒక వికెట్ సాధించాడు.161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గాన్ జట్టుకు ఆదిలోనే షాక్ తగిలింది. స్టార్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ డకౌట్ అయి పెవిలియన్‌కు చేరాడు. అయితే మరో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (53) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. బౌలింగ్‌లో మెరిసిన ఒమర్జాయ్, బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించాడు. కేవలం 21 బంతుల్లోనే 40 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే అఫ్గానిస్థాన్ లక్ష్యాన్ని ఛేదించింది.

గ్రూప్-డి పాయింట్ల పట్టికలో ప్రస్తుతం సౌతాఫ్రికా వరుసగా మూడు విజయాలతో అగ్రస్థానంలో ఉండి ఇప్పటికే సూపర్-8కు అర్హత సాధించింది. రెండో స్థానంలో న్యూజిలాండ్ ఉండగా, తాజా విజయంతో అఫ్గానిస్థాన్ మూడో స్థానంలో నిలిచింది. అఫ్గాన్లు తమ తర్వాతి మ్యాచ్‌లో కెనడాపై కచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. అదే సమయంలో న్యూజిలాండ్ తన చివరి మ్యాచ్‌లో కెనడా చేతిలో ఓడిపోతే, రన్ రేట్ ప్రాతిపదికన అఫ్గానిస్థాన్ సూపర్-8కు వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో ఈ గ్రూప్‌లో పోటీ ఇప్పుడు రసవత్తరంగా మారింది.గత కొన్నేళ్లుగా అఫ్గానిస్థాన్ జట్టు పసికూన స్థాయి నుంచి దిగ్గజ జట్లను ఓడించే స్థాయికి ఎదిగింది. స్పిన్ బౌలింగ్‌కు పేరుగాంచిన ఈ జట్టులో ఇప్పుడు పవర్‌ఫుల్ హిట్టర్లు, వేగవంతమైన పేసర్లు కూడా తోడయ్యారు. ముఖ్యంగా ఒమర్జాయ్ వంటి ఆల్‌రౌండర్లు జట్టుకు వెన్నెముకలా మారుతున్నారు. గ్రూప్ దశ దాటి సూపర్-8లో అడుగుపెడితే అఫ్గాన్ జట్టు ఏదైనా అద్భుతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com